కథ

# రిటాల్స్

కె.వాసవదత్త రమణ

''పెళ్లివారు వచ్చినట్టున్నారే'' పార్వతితో అన్నాడు రామారావు చెప్పులు, వరండాలో విడుస్తూ!
గబగబా లోపల్నుంచి మంచినీళ్ల గ్లాసు పట్టుకువస్తూ,
''ఆ పొద్దున్నే వచ్చారు!
పెళ్లికూతురు కుందనపు బొమ్మలా ఎంత బావుందో!'' అంది పార్వతి.
మంచినీళ్లు తాగి, చొక్కా విప్పి పక్కనే కొక్కానికి తగిలించి,
పడక కుర్చీలో జారగిలపడ్డాడు.



''పోస్టాఫీసుకెళ్లి ఉత్తరం పోస్టులో పడేసి రావటానికి కూడా ఓపిక లేనట్టుగా వుందే పార్వతి!'' ఉస్సూరుమంటూ ముందుకు వంగాడు.

''అయిదయినా ఎండ తగ్గితేగా! అలసటగా ఉందా! ఏమన్నా చేసి పెట్టనా! ఆకలేస్తోందా?'' అంది పార్వతి రామారావు పక్కకు వచ్చి.

''అబ్బే ఏం వద్దు! మళ్లీ నువ్వేం చేస్తావులే! దా, ఇలా కూర్చో!'' పక్కనున్న కుర్చీ లాగబోయాడు.

''వద్దండి! కిందే కూర్చుంటాను!'' అంటూ గోడకి ఓ పక్కగా కూర్చుని చీర చెంగుతో అటు ఇటూ విసురుకోవడం మొదలుపెట్టింది.

''అయ్యో! నా మతిమండ! పక్కింటి వాళ్లు మిఠాయిలు, సున్నుండలు, జంతికలు పంపారు, అవి పెడతానుండండి'' అంటూ లేవబోయి మళ్లీ ఏదో గుర్తుకు వచ్చినట్టు చటుక్కున ఆగింది ఆమె.

''సున్నుండలా!'' నోరూరింది అతనికి. అంతలోనే తెలియని బాధ అతని కళ్లలో కదలాడింది.

''వద్దు పార్వతి! కొత్త రోగం వచ్చింది కదూ! బి.పి.కి చెల్లెలు షుగరు తోడయ్యిందిగా'' తనలో తాను అనుకున్నట్టుగా అన్నాడు.

పార్వతికి తన మీద తనకే కోపం వచ్చింది. రామారావుకి సున్నుండలు ఎంతిష్టమో ఆమె ఎరగంది కాదు.''పొరపాటున నోరు జారేను'' అనుకుని మనస్సులో బాధపడింది. ''ఇష్టమైంది ఎదురుగా పెట్టుకుని తినలేకపోవడం ఏ మనిషికైనా ఎంత బాధాకరం! పాడురోగం! ఈయనకే రావాలా'' మళ్లీ ఉక్రోశంగా అనుకుంది, తనలో తానే! రామారావుకి సున్నుండలు అంటే పంచ ప్రాణాలు. చిన్నప్పటి నుంచి అవంటే అతనికి చాలా ఇష్టం! అతని కళ్లముందు తన బాల్యం కదలాడింది.

* * *

''అమ్మా! మంచి వాసనే! నిజం చెప్పు! సున్నుండలు చేసావు కదూ! నాకు పెట్టవా!'' జారి పోతున్న నిక్కర్ని పైకి లాక్కుంటూ రామారావు తల్లిని ఆశగా అడిగాడు.

''భడవా! పట్టావా వాసన! అనుకుంటూనే ఉన్నాను'' అంటూ అనసూయ నవ్వి లోపల్నుంచి రెండు ఉండల్ని పట్టుకొచ్చి కొడుకు చేతిలో పెట్టింది.

చటుక్కున రెండు ఉండల్ని ఆత్రంగా మింగేసి, ''అమ్మా! ఇంకా పెట్టవే'' అంటూ తల్లిని పట్టుకుని కొంగులాగాడు.

''ఓర్నీ అప్పుడే మింగేసావా! ఇంక లేవురా నాన్న! నాన్నగారికి రెండు ఉండలే దాచాను'' అంది అనసూయ.

''నాక్కావాలి! నాకింకా కావాలి!'' అంటూ నేలమీద పొర్లడం మొదలుపెట్టాడు రామారావు.

''ఏమిట్రా గొడవ!'' అక్కయ్యలిద్దరూ వాడ్ని పట్టుకుని లేవదీసారు. అయినా వినకుండా నేలను కాళ్లతో బలంగా తన్నుతూ మారాం చేయసాగాడు రామారావు.

''పోనీలేవే అమ్మా! వాడికి ఒక్క ఉండ ఇవ్వవే!'' చిన్నది కమల అర్థింపుగా తల్లితో అంది.

అనసూయకి మండిపోయింది.

''చాల్లే నీ వేషాలకు, వాడి గోలకు ఇద్దరికీ సరిగ్గా సరిపోయింది. మీ నాన్న సంపాదనకు సున్నుండలు, మిఠాయిలు చేసి పెడతానులే! ఏరా! నువ్వేంట్రా! నా చేత 'లేవు లేవు' అని పదేపదే అనిపించాలా! ఏదో పక్కింటి రాజమ్మ కప్పుడు నెయ్యి ఇస్తే ఓ పది ఉండలు చేసి అందరికి తలా రెండు సర్దాను. ఇంకా కావాలంటే ఎక్కడ్నుంచి తేవాలి'' కోపంగా అనేసింది. కాని కొడుకు కళ్లల్లో నీళ్లు చూడగానే ఒక్కసారిగా ఆవేదన, ఆ వెంటనే తన దరిద్రం మీద తనకే జాలి వేసింది అనసూయకి.

''రాము రారా! బయటకు వెళ్లి ఆడుకుందాం! దొరవారి తోటకెళ్లి రామయ్యని బతిమాలి నీకు జాంపళ్లు కోసి ఇస్తాను. సరేనా'' అంటూ వాడిని సముదాయిస్తూ బయటకు తీసుకువెళ్లింది కమల.

ఏడుస్తూనే కమల వెంబడి నడవసాగాడు రామారావు.

''ఛీ! అమ్మ ఎప్పుడూ ఇంతే! ఏది అడిగినా కడుపునిండా ఎప్పుడూ పెట్టదు. ఏమన్నా అంటే ''మీ నాన్న లక్షలు సంపాదిస్తున్నాడా మీకు దండిగా చేసిపెట్టడానికి అంటుందే అక్కా! నేను ఇకనుంచి అమ్మతో మాట్లాడనే మాట్లాడను, చూడు!'' రోషంగా అంటూ కళ్లు తుడుచుకున్నాడు.

''మళ్లీ నాన్నకేమో రాత్రి పళ్లెంలో బోలెడు పెడుతుంది. పిల్లలకు మటుకు పెట్టదు. ''సంపాదించే మగాడురా, ఆయన బాగుంటేనే మనం బాగుంటాము'' అంటూ అన్నీ ఆయనకే పెడుతుంది.''పిల్లలం , మాకేమో పచ్చడి మెతుకులు, ఆయనకేమో పెరుగన్నాలు'' ఉక్రోశంతో గుండె మండిపోయింది వాడికి.

''తప్పు రాము! అలా మాట్లాడకూడదు!'' అంటూ కమల మందలించింది.

''ఏమైనా సరే, నేను పెద్దయ్యాక బోలెడు డబ్బులు సంపాదించి అమ్మ చేత బోలెడు సున్నుండలు చేయించుకుని కడుపునిండా తింటాను'' గట్టిగా నిశ్చయించుకున్నాడు రామారావు, అక్క చేయి పట్టుకుని నడుస్తూ.

* * *

ముగురు అక్కల పెళ్లిళ్లు అయ్యేటప్పటికి అతని కుటుంబం పూర్తిగా చితికిపోయింది. రామారావు చదివిన ఐటిఐ చదువుకు ఎలక్ట్రిసిటీ ఆఫీసులో చిన్న ఉద్యోగం దొరికింది. రామారావు రెక్కల కష్టం మీద తల్లిదండ్రులు, తమ్ముడి చదువు సాగడం ఎంతో గగనమైంది.

''బోలెడు డబ్బు సంపాదించాలి! బాగా తినాలి! తిరగాలి! జీవితాన్ని బాగా అనుభవించాలి'' అన్న తన కోరిక ఎండమావే అనిపించసాగింది అతనికి రాను రాను!

తమ్ముడికి శేఖర్ చదువు పూర్తయి ఉద్యోగంలో చేరిన రోజు పరమానంద భరితుడయ్యాడు రామారావు.

''ఇంక మనకేం లోటు ఉండదు! వాడి సంపాదన, నా సంపాదనతో చాలా సుఖంగా బతకేయవచ్చు, మనకి మంచి రోజులొచ్చాయ్ అమ్మా!'' తల్లి ఒళ్లో తల పెట్టుకుని పడుకుంటూ సంబరపడ్డాడు చిన్న పిల్లాడిలా.

''అవున్రా అబ్బీ! శాస్త్రి గారు కూడా నాలుగు మంచి సంబంధాలు పట్టుకు వచ్చారు, మంచిది చూసి, నీకు ముడేస్తే ముచ్చట తీరుతుంది. నీకు తోడు దొరుకుతుంది'' రామారావు కళ్లల్లోకి ప్రేమగా చూసింది అనసూయ.

''అమ్మా! సున్నుండలు చేసి పెట్టవే! చాలా రోజులయ్యింది తిని!'' రామారావు హుషారుగా లేచి కూర్చుంటూ అన్నాడు.

''అలాగే లేరా!'' అంటూ సాయంత్రం అతను ఆఫీసు నుంచి వచ్చేటప్పటికి రెడీ చేసి పెట్టింది అనసూయ.

పళ్లెంలో తీసుకుని తినబోతుంటే ఇంటి ముందు జీపు ఆగింది. తమ్ముడు, ఇద్దరు ముగ్గురెవరో దిగారు, అందులోంచి!

''అన్నయ్య! మా ఇంజనీరు గారు!'' అంటూ ఒకాయన్ని కుర్చీలో కూర్చోబెడుతూ పరిచయం చేసాడు శేఖర్! అనసూయ హడావుడిగా చేసిన సున్నుండల్ని అందరికీ సర్దిపెట్టింది.

''చల్లకొచ్చి ముంత దాయడం ఎందుకు? విషయం సూటిగా చెబుతున్నాను. మీ అబ్బాయి శేఖర్‌కి మా అమ్మాయిని ఇద్దామని అడగటానికి వచ్చాను'' అన్నాడాయన సున్నుండలు తింటూ!!

''అమ్మా! నాన్న బయటకు వెళ్లారా!'' శేఖర్ సిగ్గు పడుతూ అడిగాడు.

''అవున్రా చంద్రం! అన్నయ్య గారు, అయినా మా పెద్దాడికి ఇంకా పెళ్లే కాలేదు. వాడిదయ్యాక కదా చిన్నవాడి సంగతి, అందుకని ఇప్పుడే వీలు పడదు'' నెమ్మదిగా చెప్పినా కటువుగా అంది అనసూయ.

ఆయన ఫెళ్లుమని నవ్వి,''అలాగే మగపిల్లాడికి పెళ్లవడం ఎంతసేపు! కాని మన పిల్లలిద్దరూ ఒకరినొకరు ఇష్టపడుతున్నారు. అందుకే ముందు తాంబులాలు పుచ్చుకుని, మీ పెద్దాడికి కుదిరాక ఇద్దరికీ ఒక్కసారే పెళ్లిళ్లు ముగించేస్తే, అటు నా బాధ్యత రెండు తీరుతాయి. ఏమంటారు'' అన్నాడు.

శేఖర్ సిగ్గుగా,సంతోషంగా కూర్చుని ఉన్నాడు. అనసూయ ఏం పాలుపోనట్లుగా తెల్లబోయి రామారావు వంక చూసింది, ఏం చేద్దామన్నట్టుగా! తింటున్న సున్నుండ చేదుగా అనిపించింది రామారావుకి.

దాన్నలాగే పళ్లెంలో పడేసాడు. తమ్ముడు తన స్వార్థం చూసుకోవడం, అతనికి మింగుడు పడలేదు. పేలవంగా నవ్వుతూ''అలాగే లెండి, నాన్నగారితో మాట్లాడి మీకు మళ్లీ కబురుచేస్తాను'' అంటూ వాళ్ళని సాగనంపాడు.

''నేను ఆ అమ్మాయినే ప్రేమించాను'' అని శేఖర్ పట్టుపట్టడంతో ఓ నెల రోజులకు రామారావు పెళ్లి, మరోవారం తేడాతో శేఖర్ పెళ్లి జరగడం, శేఖర్

ఇల్లరికం వెళ్లడం అంతా అనుకోకుండా, హడావిడిగా జరిగాయి.

పార్వతి సారె పట్టుకుని కాపురానికి వచ్చింది. ఆ రోజు కడుపునొప్పి, విరోచనాలు రామారావుకి. సారె కింద పార్వతి పుట్టింటి వాళ్లు పెద్ద స్టీలు క్యాను నిండా సున్నుండలు తెచ్చారు. తినడానికి రామారావుకి కడుపు బాగోలేదు. ఓ నాలుగు రోజుల తర్వాత తిందామనిపించి రామారావు తల్లిని అడిగితే ''అందరికి పంచేసానురా పాడైపోతాయని!'' అంది అనసూయ.

నిర్లిప్తంగా చూశాడు రామారావు తల్లికేసి.

రామారావుకి ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల పుట్టారు. రోజులు గడిచే కొలది ''ఇక ఏం చేసినా, ఏం తెచ్చినా తన పిల్లల కోసమే'' అన్న తాపత్రయం రామారావులో అణువణువు పెరగసాగింది.

''వాళ్లకేలోటు రాకూడదు! రాజాల్లాగా పెంచాలి. బాగా చదివించాలి.. వాళ్లకి మంచి జీవితాన్ని ఇవ్వాలి. అప్పటికే చేసిన త్యాగాలతో, బోలెడు అప్పులతో, సగం జీవితం అయిపోయింది. కనీసం పిల్లలైనా బాగా చదివించి వాళ్ల బతుకుల్ని అందంగా తీర్చిదిద్దాలి'' ఇదే తపన అతనిలో.

నోరు కట్టుకుని,''ఎంత కూడ పెడితే అంత పిల్లలకు బాగా జరుగుతుంది'' అని కష్టపడేవాడు, పిల్లల బాగుకోసం తపించి పోయాడు. సాయంత్రాలు కొట్లల్లో ఎకౌంట్స్ రాసేవాడు. రాత్రనక, పగలనక, చాలా కష్టపడ్డాడు.

* * *

''రామారావు! చిన్న పనోయ్!'' చనువుగా వచ్చి తోటి క్లర్కు పక్కనే కూర్చున్నాడు.

సీట్లో సీరియస్‌గా పనిచేసుకుంటున్న రామారావు ఏంటన్నట్టుగా కళ్లెత్తి చూశాడు.

''అదిగో అక్కడ కూర్చున్నాడు చూడు, ఆయన వీరయ్య అని చింతలపాలెంలో ఉంటాడు. నాకు చాలా కాలం నుంచి బాగా తెలిసినవాడు. వాళ్ల ఇంటి కరెంటు కాగితం సెటిల్‌మెంట్ కోసం ఒకటి నీ దగ్గరకు వచ్చింది. కొంచెం అతని పని కానిస్తే!'' అర్థోక్తిగా ఆపాడు అతను.

నొసలు చిట్లించాడు రామారావు.

''కుదరదు! బిల్ కలెక్టర్ రిపోర్టు ఇంకా రాలేదు. అది లేకుండా పుటప్ చేయడం కుదరదు'' కచ్చితంగా అన్నాడు.

''అందుకే కదా నీ దగ్గరకొచ్చింది, ఉత్తినే ఏం చేయనక్కర్లేదులే. ఒక కిలో మంచి నెయ్యి, 5 కిలోల మినుములు పట్టుకొచ్చాడు, బీదరైతు, అంతకన్నా ఇంకేం ఇవ్వగలడు'' అన్నాడు క్లర్కు.

రామారావు కళ్ల ముందు ఘుమఘుమలాడే సున్నుండలు కదలాడసాగాయి. అంతలోనే అతనిలో వివేకం మేల్కొంది.

'' ఐ యాం వెరీ సారీ! నేను అలాంటి పనులు చేయనని నీకు తెలుసుగా!'' ఇక నువ్వెళ్లొచ్చు అన్నట్టు ఫైలులో తలదూర్చాడు.

* * *

''అమ్మ పోయాక సున్నుండలే తినలేదే, పార్వతీ!'' అన్నాడు ఒకరోజు రామారావు.

''ఏమిటో! మీకు సున్నుండలు ఇష్టమని ఎన్నో సార్లు అనుకుంటా గాని, చేయడమే పడదు! ఇవాళ చేస్తానులెండి!'' అంది పార్వతి నవ్వుతూ.

అనడమే కాదు సాయంత్రం ఆఫీసు నుంచి రాగానే ప్లేటులో పెట్టి అతనికి అందించింది, ప్రేమగా.

నోట్లో పెట్టుకుని ''పంచదారతో చేసావా! ఛీ! రుచే పోయింది!'' ఆగ్రహంగా అన్నాడు రామారావు.

''అయ్యో! రవీంద్ర పంచదారతో బావుంటుంది అలాగే చేయమన్నాడండీ! సరేలే అని బెల్లంతో కాకుండా పంచదార వేసి చేసాను, పిల్లలు కూడా ఎంతో ఇష్టంగా తిన్నారు!'' పార్వతి ఎంతో నొచ్చుకుంటూ అంది.

రామారావు కోపం చప్పున చల్లారిపోయింది, ''పోన్లే పార్వతీ! పిల్లలకి నచ్చింది కదా! మనం తినేదానికి ఏదయితే ఏమిటి! వాళ్లకి పంచదారతో ఇష్టమయితే, ఇకనుంచి అలాగే చేయి'' అంటూ ఒక్కటి బలవంతంగా నోట్లో వేసుకుని చేయి కడిగేసుకున్నాడు.

పార్వతి మనసు విలవిలలాడింది.

''రేపు బెల్లంతో నాలుగు ఉండలు చేసి పెడతాను లెండి'' అంది చాలా బాధపడుతూ.

''వద్దు,వద్దు! నెయ్యి నెలాఖరు వరకు రాకపోతే మళ్లీ ఇబ్బంది! తర్వాత చూద్దాంలే!'' నవ్వుతూ లోపలికి నడిచాడు రామారావు. మధ్య తరగతి సంసారంలో ఉండే దిగులు కమ్మింది పార్వతికి!!

* * *

''రా జగన్నాథం! ఏన్నేళ్లకి కలిసాము'' ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు రామారావు.

''మా పెద్దాడు రవీంద్ర ముంబాయిలో, చిన్నాడు వంశీ చెన్నైలో స్థిరపడ్డారు. రవీంద్రకు ఒక కొడుకు. నాలుగేళ్లవాడు. వంశీకి ఇంకా పిల్లలు లేరు, మా అమ్మాయి వందన హైదరాబాద్‌లో ఉంటోంది. దానికిద్దరు పిల్లలు''

చాలా కాలానికి కలిసిన బాల్య మిత్రుడితో తన పిల్లల గురించి చెబుతుంటే రామారావు కళ్లలో గర్వం కొట్టొచ్చినట్టు కనపడింది.

జగన్నాథం అంతా విని ''బాగానే వుందిరా రాము! మరి మీరిద్దరు ఇక్కడ ఒంటరిగా ఎందుకు చెప్పు? ఎవరి దగ్గరో ఒక్కళ్ల దగ్గరకు వెళ్లి అక్కడ సెటిల్ అవ్వవచ్చుగా'' అన్నాడు.

హాస్యంగా చెప్పడానికి ప్రయత్నించాడు రామారావు.

''అది నిజమేలే, ఇక్కడ మనం, పిల్లలు లేకుండా ఉండలేం, అలా అని వాళ్ల దగ్గరకెళ్లి మనం మసలలేం! ఇప్పుడు ఇది నీ బాధే కాదు అందరి బాధ ఇదే'' నిట్టూరుస్తూ అన్నాడు జగన్నాథం.

''బాగా చెప్పారు అన్నయ్య గారు! సరదాపడి వెళ్లినా నాలుగురోజులు కూడా ఉండలేకపోతున్నాం. ఆ ఊళ్లు, వాళ్ల హడావిడి, వాళ్ల పరుగులు చూసి ''అమ్మ బాబోయ్-మన ఊరు వచ్చేసి మన ఇంట్లో ఇంత చారన్నం తిని పడుకుంటే అదే మేలు అనిపిస్తుంది'' కాఫీ గ్లాసు టేబుల్ మీద పెడుతూ అంది పార్వతి.

ఆమె మాటలకు ఏకీభవిస్తూ, తలాడిస్తూ అలాగే ఆలోచనల్లో మునిగిపోయారు స్నేహితులిద్దరూ.

రోజులు గడిచిపోతున్నాయి!

* * *

''మమ్మీ! వాటీజ్ దిస్ సున్నుండ!'' అని అడుగుతున్న అనురాగ్‌ని ఆశ్చర్యంగా చూశాడు రవీంద్ర.

''రవీ! సీ దిస్ బాయ్! ఒకటే చంపుతున్నాడు, సున్నుండ కావాలని! ఈ బొంబేలో వీడి స్కూల్లో ఎవరో సున్నుండ తెచ్చివాడికి పెట్టారట, అదేమిటో మళ్లీ, ఇంకా తినాలనిపిస్తోందిట! ఎక్కడి నుంచి తెస్తాం!'' చిరాగ్గా అంది మృణాళిని కిచెన్‌లోంచి వంట చేస్తూ.

''మృణాళిని! వీడికి నాన్న పోలిక వచ్చిందేమో! నాన్నకి కూడా సున్నుండలు అంటే చాలా ఇష్టం'' రవీంద్ర ఉత్సాహంగా అన్నాడు.

''బాగానే వుంది సంబడం. మీ నాన్నగారికి ఇష్టమయితే మీ అమ్మగారు చేసిపెడితే ఆయన అక్కడ తినగలరు కాని, మనం వీడికి ఎక్కడినుంచి తెస్తాం, ఆ సున్నుండలు! నాకేమో చేయడం రాదు. ఆ, అన్నట్టు, ఆ బాంద్రాలో ఏదో ఆంధ్ర స్వగృహ స్టాల్ పెట్టారుట. మా కొలీగ్ చెప్పింది, మీరు వస్తూ ట్రై చేయండి. ప్లీజ్..రవి'' చేయి తుడుచుకుంటూ వచ్చింది మృణాళిని.

''అలాగే! చూస్తాను బాయ్ అనురాగ్'' అంటూ ఆఫీసుకు బయలేదేరి వెళ్లాడు.

రోజూ మృణాళిని, అనురాగ్ పొద్దున్నే అతనికి సున్నుండలు తెమ్మని గుర్తు చేయడం, రవీంద్ర మరిచి పోవడం, ఇద్దరు సాయంత్రాలు అతని మీద అలగడం చాలా రొటీన్ అయిపోయింది.

ఆ రోజూ రవీంద్ర ఆఫీసులో చాలా అలిసి పోయాడు. అతనికి ఇక ఏ పనిచేయలేనిపించలేదు. పని ముగించుకుని కారులో ఇంటికి బయలు దేరాడు.

''బోలెడు డబ్బు జేబుల్లో, బ్యాంకులో వుంది. కాని తినడానికే టైం లేదు, కొనడానికీ టైం లేదు. అనుభవించడానికి అంతకన్నా టైం లేదు. ఏం జీవితాలు మావి, పిల్లాడికో స్వీటు కొనడానికి కూడా వీలు కావడం లేదు. రోజూ టార్గెట్‌లతో ఆఫీసులో లేటయిపోతుంది'' నిస్పృహగా అనుకున్నాడు.

ఇంటికి రాగానే ''మృణాళిని, నాకు ఎందుకో డల్‌గా అనిపిస్తుంది. లైఫ్ చాలా బోరింగ్‌గా వుంది'' అలసటగా అన్నాడు.

''ఏమైంది రవి'' అతని జుట్టులో వేళ్లు పెట్టి నిమురుతూ మృదువుగా అంది.

''మృణాళిని ఎందుకనో నాన్నని, అమ్మని చూడాలని బలంగా అనిపిస్తోంది! మనం వెళ్లి చాలా రోజులయ్యింది కదా!''

''రవి! నా ప్రాజెక్టు అయ్యిందికదా! వర్రీ



అవ్వకు! ఓ త్రీ డేస్ వెళ్లి వద్దాం లే! రేపే ఫ్లైటులో వెళదాం, ఊరికే డిప్రెస్ అవ్వకు. సరేనా!''

* * *

''ఏవండీ! లేవండీ! చీకట్లు ముసురుతున్నాయి'' పార్వతి భుజం మీద తట్టింది మెల్లగా, రామారావుని.

''అరటికాయ వేపుడంటే ఎంత కష్టమో కదా!'' చటుక్కున అన్నాడు రామారావు.

పార్వతి మనసులో రవీంద్ర రూపం మెదిలి తల్లి మనసు కొడుకు కోసం ఆరాటపడటం మొదలు పెట్టింది.

''నిజమే! వాడు ఎంత కూరయినా ఉత్తినే తినేసేవాడు, ఇప్పుడక్కడ ఏం ఉద్యోగాలో ఏమో? అస్సలు కడుపునిండా అన్నం తినడమే ఉండదు. ఏవో రెండు మెతుకులు తిని ఇద్దరు ఆదరాబాదరాగా వెళ్ళిపోతారు పొద్దున్నే! ఒక్కొక్కసారి వండుకోరు కూడా, అవేమిటో బ్రెడ్డులు, పిజ్జాలు తీసుకుని తినేసిపోతారు. అయినా, అమ్మ దగ్గర కూర్చుని వేడన్నం ముద్ద ముద్ద కలుపుకుని తిన్న సాటి దేనికయినా ఉంటుందా'' బాధగా అంది.

''రోజులు మారుతున్నాయి. అలాగే అలవాట్లు, పద్ధతులు కూడా! తరాల అంతరాలు! ఏమి చేయలేము పార్వతి! మనకప్పుడు తినాలన్నా, కొనాలన్నా డబ్బు సరిపోయేది కాదు. అలాగే ఎడ్జస్టు అయ్యేవాళ్లం. ఇప్పుడు అన్నీ కొనుక్కోగలం, చేసుకోగలం. కాని అరగడానికి ఆరోగ్యమే లేదు. నాకు బి.పి.,షుగరు. నీకేమో ఆయాసం'' ఆవేదనగా అన్నాడు రామారావు.

భారంగా నిట్టూర్చింది పార్వతి.

''మరి వీళ్లకేమయ్యింది? శుభ్రంగా అన్నీ తెచ్చుకుని, చేసుకుని తినక, ఆరోగ్యాలు తగల పెట్టుకుంటున్నారు. వాళ్లు తినరు సరికదా వాళ్ల పిల్లలకు పెట్టరు. ఓపిక ఉంటే ఆ బైట తిళ్లు తెచ్చుకుని తిని, ఆ తర్వాత అరగక డాక్టర్ చుట్టూ తిరుగుతూ అవస్థపడతారు. చివరికి నా మనవడికైనా వేడిగా చేసి పెట్టుకుని తినిపించే యోగం లేకుండా పోయింది నాకు!'' కళ్లొత్తుకుంది పార్వతి.

''అమ్మా, నాన్నా'' వడివడిగా రవీంద్ర లోపలికి వచ్చాడు. పార్వతి తన కళ్లని తానే నమ్మలేకపోయింది.

''నానమ్మా'' అంటూ అనురాగ్ దగ్గరకు వచ్చాడు.

వాడిని అలాగే చంకన వేసుకుని ఆనందంతో తబ్బిబ్బు అవుతూ, '' ఏవండీ! మన రవి వచ్చారండీ! రవి ఇదిగో, ఇప్పుడే నీ గురించే తలుచుకుంటున్నాము. వెయ్యేళ్లు ఆయుష్షు పోసుకుని చల్లగా ఉండు నాయనా! అమ్మా! మృణాళిని రామ్మా. నిజంగా ఎంత ఆనందంగా ఉందిరా మిమ్మల్ని చూసి'' సంబరపడి పోయింది పార్వతి మెరిసే కళ్లతో వాళ్లను చూస్తూ.

''తాతయ్యా'' అనురాగ్ వచ్చి రామారావు దగ్గరగా నిలబడ్డాడు. రామారావుకి అవ్యక్తమైన ఆనందంతో నోరు పెగల్లేదు.

''రారా! ఇలారా! దగ్గరకు!''అంటూ మనవడిని గట్టిగా హత్తుకున్నాడు.

''నా మనవడు, నా రక్తం, నా వంశం'' ప్రేమ, అభిమానం పొంగి పొరలగా అనురాగ్‌ని గుండెల మీద తీసుకుని వీపు నిమిరాడు.

''చాలా మంచి పని చేశారమ్మా! మాకు ఏమిటో నాలుగు రోజులు నుంచి అస్సలు ఏదీ తోచి చావడం లేదు. ఇలా ఎంతసేపని ఒకరినొకరు ముఖాలు చూసుకుంటూ కూర్చుంటాం చెప్పు!''

''రవీంద్రా! లేవండి! స్నానాలు చేద్దురు'' అంటూ పార్వతి వాళ్లని హడావిడి చేసి ఇల్లంతా కలియ తిరుగుతూ అన్నీ అమర్చి పెట్టింది కొడుక్కి, కోడలికి.

వాళ్లున్న నాలుగు రోజులూ క్షణాల్లా గడిచాయి రామారావుకి, పార్వతికి! రకరకాల పిండివంటలు చేసింది పార్వతి సంబరపడిపోతూ! వాళ్లు వెళ్లే రోజు రాగానే ఇద్దరి గుండెలు బరువెక్కాయి, బాధతో!

''అనురాగ్! బోలెడు సున్నుండలు చేసాను. రోజూ ఒక్కటే తిను. ఎక్కువగా తినకు. అజీర్ణం చేస్తాయి. బాగా చదవుకోలేవు!! మళ్లీ సెలవులిచ్చిన వెంటనే నానమ్మ దగ్గరకు వచ్చేయాలి. సరేనా! అప్పుడు మళ్లీ బోలెడు సున్నుండలు చేసి పెడతాను'' అంది పార్వతి, మనవడ్ని దగ్గరికి తీసుకొని గట్టిగా ముద్దుపెడుతూ.

మృణాళినికి చీర, జాకెట్టు బొట్టు పెట్టి ఇచ్చింది. రవి, మృణాళిని,అనురాగ్ ఇద్దరి కాళ్లకి దండం పెట్టారు. దుఃఖంతో వీడ్కోలు తీసుకుని వెళ్లిపోయారు. రెండు రోజుల వరకు రామారావు, పార్వతి ఆ బాధ నుంచి కోలుకోలేక పోయారు.

* * *

''ఏవండి! ఒక్క సున్నుండ తినండి! ఫరవాలేదు! ఇన్సులిన్ తీసుకుందురు గాని, అంతగా కావలిస్తే'' బ్రతిమాలింది పార్వతి, ఆ మర్నాడు భర్తని.

బదులుగా నవ్వాడు రామారావు.

''వద్దు పార్వతి! నిజంగానే ఇప్పుడేం తినాలని పించడం లేదు. పిల్లలు వచ్చి వెళ్లారన్న తృప్తితో మనసంతా నిండిపోయింది. కడుపు నిండిపోయిం దనిపిస్తోంది'' పార్వతికేసి చూస్తూ అన్నాడు రామారావు.

''వాళ్లు అలా ఒక్కసారి ఇలా వచ్చి వెళితే, అంతే చాలు! మనం వాళ్ల దగ్గరికి వెళ్లడం వాళ్ళతో కలిసి అక్కడ ఉండటం అన్నది కల్ల. వీళ్లు వచ్చి ఇలా మనతో నాలుగు రోజులుండి అలా వెళితే, మనకదే ఎంతో శక్తి! మన బ్యాటరీలన్నీ రీచార్జి అవుతాయి. ఆ శక్తిని మళ్లీ వాళ్లు తిరిగి వచ్చే వరకు జాగ్రత్తగా వాడుకోవాలి. పార్వతి! పెద్దవాళ్లమయ్యాం! ఇప్పుడు మనం తిండితో నింపుకోవడానికి చూడ కూడదు. మనసు నింపుకుని తృప్తిగా బతుకు బండిని నడపడానికి ప్రయత్నించాలి''

భర్త మాటలకు తలాడిస్తూ, రామారావు పాదాల చెంత కూర్చుండి పోయింది పార్వతి అలాగే! అస్తమిస్తున్న సూర్యుడులోంచి, వెన్నెల్ని చిమ్ముతూ చంద్రుడు నెమ్మదిగా పైకి వస్తున్నాడు.

★